# ఇకపై పీవోఎస్ విధానంలో స్కాలర్‌షిప్ మంజూరు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు హనుమంతు నాయక్

గుంటూరుసిటీ, న్యూస్‌లైన్

జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకారవేతనాలను ఇక నుంచి నూతనంగా పి.వో.ఎస్ డివైజ్ పద్ధతిద్వారా మంజూరు చేయనున్నట్లు సాంఘిక, సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు డి.హనుమత్ నాయక్ తెలిపారు. స్థానిక ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పి.వో.ఎస్ డివైజ్‌కు, ఈపాస్‌ను అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఉపకార వేతనాలకోసం విద్యార్థి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత అప్లికేషన్ నెంబరును పి.వో.ఎస్ డివైజ్‌లో నమోదు చేస్తామన్నారు. ఆధార్ కార్డులోని వేలిముద్రలు, డివైజ్‌లోని వేలిముద్రలతో సరిపోలితే ఆ విద్యార్థికి ఉపకార వేతనం మంజూరు చేస్తారన్నారు. జిల్లాలోని 574 కళాశాలల్లో ఈ డివైజ్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. నరసరావుపేట, గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు శుక్రవారం ఉదయం 11గంటలకు పీఎంసీ కె.ఆర్ కళాశాలలో దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 3గంటలకు గుంటూరు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో తెనాలి, గుంటూరు డివిజన్‌ల వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ కలల పథకంద్వారా 7 జనరల్ హాస్టల్స్, 5 కాలేజీ హాస్టల్స్, 2 సమీకృత హాస్టల్స్ మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు నుంచి పదవ తరగతిలోపు చదివే ఎస్సీ విద్యార్థులు, 9,10 తరగతులు చదువుతున్న ఎస్టీ, బీసీ విద్యార్థులు రాజీవ్ విద్యాజీవన్ పథకం కింద స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కొత్తగా న్యాయశాస్త్రం పూర్తి చేసిన ఎస్సీ విద్యార్థులకు శిక్షణకు పంపించటానికి నెలకు రూ.1000 స్టైపెండ్, సంవత్సరానికి రూ. 6వేలు పుస్తకాల కోసం చెల్లిస్తామన్నారు. ఆరుగురు అభ్యర్థులకు అవకాశముంటుందన్నారు.